
# ముల్లును ముల్లుతో...




అమ్మో దీని సిగదరగ!... పుర్రెకు పుట్టెడు ఆలోచనలు!

పుర్రెమీద మొలిచే వెంట్రుకలు లెక్కలేనన్ని. పుర్రెలో ప్రవాహవేగంతో లేచే ఆలోచనలు వాటికి మించినన్ని. వెంట్రుకలైనా వెనకనో ముందరనో మనతో నిమిత్తమే లేకుండా ముందు వెనకగా రాలిపోతుంటాయి– ఎపుడో ఒకప్పుడు. వాటికి తోచినపుడు. అయితే ఆలోచనలు మాత్రం మెదడు చెలమలో ఊరుతూనే ఉంటాయి సమయాసందర్భాల్ని అవహేళన చేస్తూ!

ఆలోచనలపుట్ట అయిన మెదడును ఒకే ఒక్క ఆలోచన అలుముకొనింది. అది భూతమై ఆవహిస్తే నిలిచిన చోట నిలబడలేకపోతున్నాను. కూర్చున్నచోట పట్టుమని పదినిమిషాలు కుదురుగా కూర్చోలేకపోతున్నాను. అన్యాయం అతిచాకచక్యంగా చేతులు చాపి అమాయకతను కౌగలించినట్లు కౌగలించి అమాంతంగా మింగేస్తే నామొగం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్న ముఖ్యమంత్రి మొగంకంటే మూడురెట్లు ఘోరంగా తయారయింది. అది గమనించిన ఆపల్లెలో నామిత్రుడు కారణం అడగలేక అడగకుండా ఉండలేక సందేహం గుటకలు మింగుతున్నాడు.

అసలు నేనాపల్లెకు ప్రయాణం కట్టడమే అరుదు. ప్రయత్నపూర్వకంగా కుదిరితే అది ఏ అయిదారేండ్లకో ఒక్కసారి. అంతకంటే అవసరం కూడా ఉండదు. ఉండడానికి అవకాశం అసలే లేదు. వీధిబడిలో కూర్చొని ఇసుకపై ఓనమాలు దిద్దిన నాటినుండి ఆ ఇసుకతో నాకు అనుబంధం ఉంది. వేళాపాళ లేకుండా తిరిగిన అక్కడిమట్టితో నాకు పరిచయం ఉంది. రాళ్ళూ రప్పలు నన్ను చూస్తే పెదవి విప్పి పలకరిస్తాయని... చెట్టూ చేమలు నాచూపుల్తో చూపులు కలిపి పరవశించి తలలు ఊపుతూ నాకు స్వాగతం పలకతాయని... తప్పటడుగులు వేసే వయసులో తలదువ్వి సాదుచుక్క పెట్టి చాలదన్నట్టు బుగ్గమీద దిష్టిచుక్కపెట్టి చంకకెత్తుకొని ఊరేగినవాళ్ళ కళ్ళు నన్నుచూసి ఆనందంతో మెరుస్తాయని ఊహలకు ఊపిరిపోస్తూ ఉవ్విళ్ళూరేవాడిని!

అయితే ఒకే ఒక్క నాలుగు పదుల వయసు నాలో తెచ్చిన మార్పులతో పోటీపడినట్లుగా ఊళ్ళో ఊహించని మార్పులు వచ్చాయి. చుట్టు గుడిసెలు మూడు అంకణాల పూరిండ్లు అయ్యాయి. పూరిండ్లు మిద్దెలయ్యాయి. మిద్దెలు ఏకంగా మేడలే అయ్యాయి. ఆడుకొన్న జారుడుబండల గుండెలు ముక్కలు ముక్కలుగా చీలి ఇంటిగోడల్లో తలదాచుకొన్నాయి. పల్లెకు చల్లని నీడనిచ్చిన పచ్చని చెట్లు కాలి బొగ్గుగా మారి పట్టణాల్నిచేరి డబ్బుగా రూపాంతరం చెంది స్వార్థుల జేబుల్లో చలామణి అవుతూ ఉంది. గోరుముద్దలు తినిపిస్తూ చందమామను చూపించిన అనురాగాల తల్లులు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. ఇప్పుడు నాకా పల్లెలో మిగిలింది ఒకేఒక్క మిత్రుడు. వాడెప్పుడో ఒకప్పుడు నేనున్నానంటూ మనసులో మెదలుతాడు. కాలు కదులుతుంది.

నిజానికి చిన్నప్పుడు వాడికీనాకు చుక్కెదురు!

గొప్పలు పోవడమంటే నా అరికాలిమంట ఉచ్చికెక్కుతుంది. అయినా చెప్తున్నాను– ఆరోజుల్లో నాఈడు పిల్లలు నా తెలివికి దాసోహమన్నట్లుగా నన్నుచూస్తే మడిచేతులు కట్టుకొని నిలబడేవాళ్ళు. అమరసటిరోజు తరగతిలో నేను వేసే చెంపదెబ్బల జోరు తగ్గించమని నన్ను వీపులమీద ఎక్కించుకొని ఉప్పుమోసేవాళ్ళు. రెండు చక్రాల చిన్నబండిపై కూర్చోబెట్టుకొని అమితవేగంగా లాగి నాఅభిమానాన్ని దోచుకొనేవాళ్ళు. వేరుశెనగక్కాయలు బెల్లం ఇండ్లలోనుండి దొంగతనంగా అయినా తెచ్చిచ్చి నన్ను ప్రసన్నం చేసుకొనేవాళ్ళు!

అయితే వీడు మాత్రం దేనికీ లొంగేవాడు కాదు.

పలుకే బంగారమన్నట్లుగా పెదవి విప్పిపలికేవాడు కాదు. అయినా జీవితంలో కొన్ని చిత్రాలు అనుకోనట్లుగా జరిగిపోతుంటాయి. కడకు వాడే నాకాపల్లెలో ఏకైక మిత్రుడుగా మిగలడం ఒక విచిత్రం!

చుట్టూ పచ్చని కొండలు... ఆకొండల్లో శ్రావ్యమైన కంఠంలో అపస్వరల్లాగా అక్కడక్కడ పెద్దపెద్ద బండలు... ఆ కొండ చరియలు ఏటవాలుగా జారిజారి ఊరివైపుప్రాకినవా అన్నట్లుగా పచ్చని పొలాలు... ఊరికి ఉత్తరంగా నాలుగు కపిలలు ఒక్కసారి కట్టేటట్టుగా పెద్దనడబావి– ఒకప్పుడు ఆపల్లె ఒక అందాల ముల్లె!

ఒకనాడు ఎడమొగం పెడమొగమైనా ఎదలో ఎదగా మిగిలిన చిన్ననాటి మిత్రుడు అప్పటికప్పుడు చెరుకుతోటలో విరిచి తెచ్చిచ్చిన చెరకు గడను నములుతూ... వాడే చెట్టెక్కి కోసి తెచ్చిన టెంకాయల్లో తియ్యని ఎలనీటిని తాగుతూ గతాన్ని రూపుకట్టించి అందులో మమేకంకావడం మాటలకందని అనుభూతి. ఈపట్టణాల్లో పరుగులతో పోటీపడే జీవితం నుంచి తాత్కాలిక విముక్తి ఆ అనుభూతి. అందుకే ఆ పల్లెకు వెళ్లేవాడిని!

ఇపుడా పల్లెలో ఉన్నానంటే– ఇంతకు మించిన కారణం ఏమీ లేదు.

ఆముందు రోజు రాత్రి ఊరినడిబొడ్డులో రచ్చబండమీద మద్దిస్తం. కత్తులూ కటార్లు క్షణక్షణానికీ పదునెక్కుతూ... నాటుబాంబులు కక్షలూ కార్పణ్యాల్ని శాసిస్తున్న రోజుల్లో మద్దిస్తం. మా ఊరి రచ్చబండ ఇంకా ఊపిరితో ఉందే అన్న ఆనందం. ఆ ఆనందంపట్టలేక మిత్రుడితో కూడా రచ్చబండ వద్దకు వెళ్ళాను.

దాదాపు ఒక్కగంట సేపు రచ్చబండకు చెవులు అప్పగిస్తే తెలిసిన సారాంశం ఏమంటే?–

ఒక రైతు తనపొలంలో కొంత అమ్మాడు. మరొకరైతు కొన్నాడు. అమ్మిన రైతు తాగుబోతు. కొన్నరైతు బతకనేర్చిన మేకు. ఈ బేరాన్ని ఒకముడికి తెచ్చింది బతుకులతో చెలగాటాలాడే పచ్చల పిడిబాకు– గ్రామకరణం. బతకనేర్చిన మేకు...పచ్చల పిడిబాకు– గుసగుసలాడుకొన్నాయి. చేతులు కలుపుకొన్నాయి. చేయవలసింది నిర్ణయించుకొన్నాయి. తాగుబోతు ఒళ్ళు తెలియనికైపులో ఇచ్చినంత కుడిచేత్తోనే తీసుకొని ఎడమచేతి బొటనవేలి గుర్తు వేయమన్నచోటంతా వేశాడు. సబ్– రిజిస్ట్రార్‌ముందు చేతులు కట్టుకొని నిలబడి పైకం ముట్టినట్లు గంగిరెద్దులా తల ఆడించాడు. పత్రాలు రిజిస్టర్ అయ్యాయి.

ఎడమచేతిబొటనవేలికి పూసిన కాసంతకందెన ఊహకందని గుంతలో తోసేస్తుందని అమ్మినవాడికి కైపు దిగినపుడే తెలిసింది. "అయ్యో! అమ్మకానికి పెట్టింది నారొండెకరాల మడిలో ఒకెకరమే!" అని నెత్తీనోరు మొత్తుకొన్నాడు. ఆమాట వినేసరికి కొన్నవాడికి కైపెక్కింది. ఆకోపులో రెండెకరాలపొలం తనదే అన్నాడు. వాడి మాటల్ని రిజిష్టరైన పత్రాలు ధృవపరుస్తున్నాయి. వాళ్ళు ఇరువురూ ఏకీభవించి చెప్పిందే తాను రాశానని అంతకుమించి తనకేమీ తెలియదని నంగనాచి కబుర్లు ఒలకపోస్తున్నాడు గ్రామకరణం.

"ఏలిముద్రల్ని అడ్డం పెట్టుకోని నానెత్తిన బండేశార్రో నాయినో!" అంటూ అయ్యోకుయ్యో మొర్రో అని అలమటిస్తున్నాడు శ్రీపురం చిన్నబ్బ.

శ్రీపురం వాళ్ళ కుటుంబం అంటే– ఆపాయకట్లో ఇంటిపేరును సార్థకపరచుకొన్న కుటుంబం. ఆకుటుంబానికి శరీరానికి రెండు నేత్రాల్లా ఆధారస్తంభాలు ఇద్దరు అన్నదమ్ములు. పెద్దతను నల్లగా ఉంటాడు. అతనిపేరు నల్లపరెడ్డి. రెండవవాడు ఎర్రగా ఉంటాడు. అతనిపేరు ఎర్రమ రెడ్డి. తమ్ముడి చేతిలో నాలుగ్గాండ్ల సేద్యం నల్లేరుపై నడకలా సాగిపోతుంటే–అన్నచేతిలో పదివేలు రొక్కం. ఆపాయకట్లో అవసరాలకు చేతులు వచ్చి చాపితే ఉత్తచేతులు ఉసూరుమన్న పాపాన పోలేదు. అయితే చేతులు మారేప్రక్రియలో ఆమొత్తం ఏటేటా చెప్పుకోదగినంత వడ్డిగా గుడ్లు

పెడుతూనే ఉంది. శ్రీపురం వారి గడపలో కాలు పెట్టే కడుపుచూసి అన్నం పెట్టే ఆనవాయితీ. అందుకే ఆయింటిసిరి మురిపాలు పోతూ ఉందని ఆపాయకట్టు గట్టినమ్మకం.

రామలక్ష్మణులని పేరుమోసిన అన్నదమ్ములు ఇద్దరు ఎదురెదురుగా నిలబడింది అరుదు. వాళ్ళతరం మారింది!

ఎర్రమ రెడ్డికి ఏడుమంది. నల్లపరెడ్డికి నలుగురు. వీరాధి వీరులు శూరాధి శూరులైన కొడుకులు. అందుకే కొంప సంఖ్యాశాస్త్రాన్ని సమర్థిస్తున్నట్లుగా పదకొండు దోవలయింది.

ఆపదకొండు దోవల్లో ఒకానొకదోవను బతుకుదోవను చేసుకొన్న వీరాధివీరుడే శ్రీపురం చిన్నబ్బ. ఈరోజుల్లో వీరత్వానికి ఏకత్వమైన తాగుడుకు తలవంచాడు. ఆ అలవాటు చరాస్థితో కొంత కాలం చలగాటమాడింది. చరాస్థి తనపేరు సార్థకపరుచుకొంటే ఇప్పుడు స్థిరాస్థి వరకు వచ్చాడు. అది కూడా వేలిముద్రల్ని గెలిచేస్తుంటే చిన్నబ్బ నోటికి చేతికి తాళం వేస్తున్నాడు.

పాలన్నం తిన్న పదిమంది పెద్దమనుషులు రాగిమానుకింద రచ్చబండమీద కూర్చొని తలకొక్కతీరుగా తర్జన భర్జనలు పడ్డారు. అర్ధరాత్రి దాక అటోయిటో తెగకపోతే మరునాటి రాత్రికే వాయిదా వేశారు.

అక్కడ ఆరచ్చబండమీద అందరితో కలిసి కూర్చొని జరిగినదంతా శ్రద్ధగా విన్నాను- ఆముందు రోజు రాత్రి. ఈరోజు ఊరిముందర కొలనుగట్టుపై ఎవ్వరో పుణ్యాత్ముడు చెట్టుకింద అమర్చిన రాతి తిన్నెపై చతికిలబడి ఆలోచిస్తున్నాను.

గ్రామకరణం తీరు... బతకనేర్చినవాడి జోరు- ఆలోచిస్తుంటే నిజంగా శ్రీపురం చిన్నబ్బ మొద్దబ్బగానే కనిపిస్తున్నాడు. ఒక్కతాగుడు వ్యసనంతో అతడికి అన్యాయం జరిగింది. అందుకే అతనికి న్యాయం జరగాలి. ఈరోజుల్లో న్యాయసాధన కత్తిమీద సాము. అయినా తప్పదు. అందుకే ఆలోచిస్తున్నాను.

పొద్దు కుంకింది. ఆలమందలు రేపిన గోధూళితో పడమటిదిక్కు పోటీపడ్తూ ఉంది. చెట్టుమీద కాకులు...కొలనులో కప్పలు రంపు చేస్తున్నాయి- ఈ అన్యాయం వాటికి అర్థమైనట్లుగా! ఆ అసురసంధ్యలో శూన్యంలో చిగులుకొన్న నాచూపులు గుంటకట్ట చివరన పూరిపాకమీద పడ్డాయి.

అది గవర్నమెంటు సారాయి అంగడి!

కొన్నిబడుగువి. కొన్ని గూనివి. కొన్ని ఎండినవి. మరికొన్ని బాగా కండపట్టినవి. కొన్ని ముసలివి. కొన్ని ముతకవి. ఎన్నెన్ని ఆకారాలో? ఈ వ్యసనానికి దర్పణాలు. ఆపూరిపాక దరిదాపుల్లో నిలబడుతున్నాయి. అటూయిటు దొంగచూపులు చూస్తున్నాయి. ఒదిగి ఒదిగి కదులుతున్నాయి- అడుగుమీద అడుగ్గా. ఆపై ఉన్నట్లుండి ఒక్కఊపులో పూరిపాకలో దూరుతున్నాయి- పాలకుండను చూసిన పిల్లుల్లాగా.

కాసేపు తరువాత ఆ ఆకారాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇపుడా ఆకారాలు ఒదిగి ఒదిగి నిలబడడం లేదు. ఆ కండ్లల్లో పిరికితనం లేదు. తమకు తామే సాటి అన్నట్లుగా ధీమాగా నిలబడుతున్నాయి. సామ్రాజ్యాల్నే జయించినంత తృప్తి ఆకండ్లల్లో తొణికిసలాడుతూ

ఉంది. అంతలోనే మెల్లగా ఊగుతున్నాయి- కొలనులో కలువలు గాలికి ఊగుతున్నట్లుగా. వాగుతున్నాయి గుంటలో కప్పల్తో పోటీపడ్తూ. ఆతర్వాత దేనిదారి దానిదిగా ఆ ఆకారాలు నడుస్తున్నాయి ఆనందమే ముందుకు కదిలినట్లుగా!

పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకొని గడించిన కూలిని ఒకడు... కొంపలో చేతికి దొరికినదాన్ని తెగనమ్మి ఒకడు... పెండ్లాం ఒంటిమీద పుస్తెనుమాత్రం మిగిల్చిన ఉదారహృదయుడు ఇంకొకడు. ఇలా ఎంతమంది? వీళ్ళల్లో ఎంతమంది శ్రీపురం చిన్నబ్బలున్నారో?...

అవును! ఇది గాంధీపుట్టినదేశం.

ఈ దేశంలో కృతజ్ఞతా భావం హిమాలయాల ఎత్తుకు ఎదిగింది. గంగా యమున నదుల్తో పోటీపడి ప్రవహిస్తూ ఉంది. అందుకే గాంధీమహాత్ముని గాడ్సే నిలువునా కాల్చి చంపినా మనం మాత్రం మరిచిపోలేదు. ఆయన విగ్రహాల్ని నాలుగురోడ్ల కూడళ్ళలో నిలబెట్టాం. మహాత్ముడు గదా? ఎండ వానల్ని సమదృష్టితో చూస్తున్నాడు. కాకులు గద్దలు మీద రెట్టవేస్తున్నా పట్టించుకోవడం లేదు. అక్కడికి ఆగలేదే మన బుద్ధులు! వీధులకు ఏకంగా గాంధీ పేరు పెట్టుకున్నాం. ఆ వీధుల్లోనే బ్రాందీ అంగళ్ళు పెట్టి మహాత్ముని సాక్షిగా వ్యాపారాలు చేసుకొంటున్నాం. ఆయన తిరస్కరించిన మదువు మగువ అంటే మనకు మహాఇష్టం! ఈ వ్యవస్థలో ఈ రెండింటిని ఎరగా వాడుకొంటే కొండమీద కోతి దిగి రమ్మంటే వచ్చేరోజుల్లో జీవిస్తున్నాం!

ఉన్నవాళ్ళు తాగనీ...తలకు పోసుకోనీ? పట్టించుకోవలసిన అవసరం లేదు. కానీ ఆలోచించవలసింది చెమటను చిల్లర డబ్బులకింద మార్చుకొనే జీవుల్ని గురించి. అలాంటి వాడు తన్ను గురించి తాను ఆలోచించుకోలేడు. అలా ఆలోచించగలిగితే ఏనాటికో ఒకనాటికి వాడూ ఉన్నవాడు కాగలడు. అందుకే ఉన్నతవర్గం వాడు ఆలోచించే ఆస్కారం కలిగించదు. అలా కలిగిస్తే వాడు చేజారిపోతాడు. పోగొట్టువాణ్ణి పొందడమంటే మాటలా? అందుకే ఈలాంటి కూలి బతుకులకు సాధ్యమైనన్ని సమస్యలు సృష్టించాలి. ఆ సమస్యల్ని పరిష్కరిస్తున్నట్లు నటించి చేరదీయాలి. చేతికందినప్పుడు పైకి లేవకుండా పడగొట్టాలి. లేకుంటే గాంధీ పుట్టిన దేశంలో చెమటజీవులరక్తంతో చెలగాటాలాడడానికి అడుగుకొక్క సారాయి అంగడా?

కొలనులో గాలివాటంగా వీస్తున్న అలలతో పోటీపడ్తూ ఆలోచనలు!

ఈ ఆలోచనలతోనే కడుపునిండి ఆకలి చచ్చిపోయింది. గుడ్డివాడు దారిమీద పడ్డట్టు సాగిన ఆలోచనలు ఎంతకాలాన్ని సద్దుసడీ లేకుండా మింగేశామో తెలియనే లేదు. తీరా తేరుకొని తేరిపారచూస్తే మలిజాము తొలిజాముకు వీడ్కోలు చెప్తున్నట్లుంది.

గుంటలో కప్పలు ఎక్కడో కొంపలు మునిగిపోతున్నట్లు అరుస్తున్నాయి. ఊళ్ళో రచ్చబండమీద వాదోపవాదాలు శృతి మించినట్లుంది. నిన్న రాత్రి అటూయిటు తేలని మద్దిస్తం మళ్ళీ ప్రారంభమైనట్లుంది. నా ఆలోచనల్లో తలదూర్చిన చెమటజీవులు కొత్తనీళ్ళు పాతనీటిని తరిమేసినట్లుగా శ్రీపురం చిన్నబ్బను ఇంతవరకు వెనక్కు నెట్టారు. రచ్చబండ నోరు చేసుకొనేసరికి

శ్రీపురం చిన్నబ్బ మనసులో మెదిలాడు. అతనికి న్యాయం జరగాలన్నది నాకోరిక. అందుకే గబగబ గుంటకట్టదిగాను. ఆ ఊపులోనే రచ్చబండ వద్దకు చేరుకొన్నాను. అక్కడ వాదోపవాదాలు తలాతోక లేకుండా తలకొక్కతీరుగా సాగుతున్నాయి!

"అదిగాదన్నా! మీరు జెప్పేది బలేబాగుండాదే? తాగి తలకు బోసుకుంటే మాత్రం అంత ఒళ్ళు తెలవకుండా బోతిందా? సాచ్చులుండ్రి. రిజిష్టారాపీసు ఉండె. ఇంతమందిని కాదని కర్నం మాత్రం కలంపుల్ల ఎట్టపట్టుకుంటాడు?" ఒక అవు నోటాయన అరుస్తున్నాడు.

"ఇదో! మాయబ్బతోడు. మాకేంవీ తెల్దు. వాళ్ళు పిల్సిరి. మేంవు పోతింవి. బస్సు ఎక్కమన్రి. ఎక్కితింవి. పాకాల్లో దిగమన్రి. దిగితింవి. ఒక పూట పూటకూళ్ళింట్లో తుమ్మితే ముక్కుల్లో పడేదాకా కూడు బెట్టించిరి. తింటింవి. ఆమీదట్నే నన్ను సేవ్రాలు చేయమన్రి. వాణ్ణి సెయ్‌గుర్తు ఎయ్‌మన్రి. వాళ్ళ దుడ్లతోనే పాకాలకుపోతింవి. వాళ్ళకూడు కుడిస్తింవి. ఇంక సేవ్రాలు పెట్టమంటే పెట్టకపోతే ఎట్టని పెట్టేస్తింవి. అంతేకానీ మాతల్లి సాచ్చిగా సెప్తాఉండా! ఈడేంవి అమ్మినాడో? ఎంతకమ్మినాడో? ఆమండేవాడి సాచ్చిగా మాకుతెల్నే తెల్దు. కడుపుకు కూడుతినే మణుసులు. ఇంత అన్నాయానికి ఒడిగట్తారని మాకు మాత్రం ఏంతెలుసు?"

ఈఘనకార్యానికి సాక్షులుగా వ్యవహరించిన వ్యక్తులు వాళ్ళగోడు వాళ్ళు వెలబోసు కొంటున్నారు.

"ముత్తేలమ్మ సాచ్చిగా సెప్తా ఉండా. మీకు తెలవన్ది ఏంవుండాది? నాకుండేది రొండే రొండెకరాలమడి. అరొండెకరాల్లో ఒక ఎకరం అమ్మేసి ఇంకొక ఎకరం పెట్టుకుణ్ణా. ఈళ్ళేంవో రొండెకరాలు అమ్మేసినట్లు రాసుకుణ్ణారు. ఇట్లా నమ్మించి నానోట్లో మట్టి గొట్తే ఇంకనేనెట్ట బతకాల్రా దేవుడో?" అని నెత్తీనోరు మొత్తుకొంటున్నాడు శ్రీపురం చిన్నబ్బ.

గ్రామకరణం ఉలక్కుండా పలక్కుండా కూర్చున్నాడు– అదీ బుద్ధిమంతుడి లక్షణం అన్నట్లుగా. మంచి చెడ్డల్ని రచ్చబండమీదికి తోలి రిజిష్టరైన పత్రాలకు చేతులు మొలిచి భుజం తడుతుంటే కుదురుగా కూర్చున్నాడు కొన్న ఆసామి. పుర్రెకొక బుద్ధి అన్నట్లుగా ఎవరికి తోచినట్లు వాళ్ళు మాట్లాడుతున్నారే కానీ ఏదీ తేల్చిచెప్పలేకపోతున్నారు.

అంతలో గ్రామపినపెద్ద శీపాటి బసిరెడ్డి గొంతు సవరించుకొన్నాడు. రచ్చబండ వద్ద వాతావరణం చిత్రంగా మారిపోయింది. అందరినోళ్ళు మూతపడ్డాయి. అందరూ ఆయన వైపు తిరిగి చెవులు దగ్గర పెట్టుకొన్నారు.

శీపాటిబసిరెడ్డి చాలా నిఖార్సయిన మనిషి. ధర్మగోవు ఆయన దొడ్లోనే పుట్టిపెరిగిందని ఆయన వెంట నాలుగు పాదాలమీద నడుస్తుందని ఆపల్లెలో ఏ ఇంటి గోడను తట్టినా చెప్తుంది. కోర్టుకెక్కిన కొంపలు కొళ్ళబోతాయని బసిరెడ్డికి అనుభవం నేర్పింది. అందుకే ఓపిగ్గా రచ్చబండ మీద కూర్చుంటాడు. ఆయన రచ్చబండమీద కూర్చుంటే ఆఊళ్ళో తలనెరిసినతరంతో కూడా మీసాలు మెలేసే వయసు పక్కపక్కన కూర్చుంటుంది.వాదోపవాదాలకు దిగుతుంది. తెలివితేటల్ని ప్రదర్శిస్తుంది. మాటకు మాటతెగులైతే పరిస్థితి జుట్లు పందెంవరకు ఎదుగుతుంది. అప్పుడు శీపాటి బసిరెడ్డి కల్పించుకొంటాడు. ఆయనమాటతో అందరినోళ్ళు మూతపడతాయి. చెవులు

మాత్రం జాగ్రత్తపడతాయి. ఆ మందికి చదువు సంస్కారం లేకపోవచ్చు. తెలివితేటలు కూడా అంతంతమాత్రంగానే ఉండవచ్చు. అయితే కట్టుబాటు తత్త్వానికి తలవొగ్గుతారు. ఆరునూరైనా ఆపద్ధతికి కట్టుపడతారు. అందుకే రాగిమానుకింద రచ్చబండ ఈ నాటికీ కోర్టుల్ని సవాల్ చేస్తూ ఉంది. ఏండ్లు పూండ్లుగా అక్కడ ఎన్నో చిక్కుముడులు తెలివిగా చిక్కు విప్పుకొన్నాయి.

నోటితోనవ్వుతూ నొసటితో వెక్కిరిస్తూ సమస్యల్ని స్వార్థంకోసం సృష్టిస్తూ సతతం సతమతమయ్యే పట్టణాల వాతావరణం ఒంటపట్టించుకొన్న వాణ్ణి కదా? ఆపల్లెమనస్తత్వానికి మనస్సు ఉప్పొంగింది. అంతలో శీపాటిబసిరెడ్డి అందుకొన్నాడు.

"శీపరం వాడేఁవో అమ్మింది ఒక ఎకరఁవే అంటా ఉండాడు. పుల్లూరోడేఁవో కొనింది రొండెకరాలని పాటపాడ్తా ఉండాడు. అయితే ఇచ్చిన దుడ్లదగ్గిర మాత్రం ఇద్దరిమాట ఒగిటిగానే ఉండాది. అయితే ఈ దినాల్లో రెండెకరాల మడి ఇంత సలీసుగా ఎవుడైనా అమ్మతాడా? చూడబోతే తాగిన యదవ శీపరఁవోణ్ణి చెయ్యిపట్టి బురదతొక్కించినట్టుండాది."

"ఔనౌను గదా? ఆమాటే మనకు తోసలా. రొండెకరాలు ఇంత చవగ్గా కొట్టేసినాడంటే పుల్లూరోడు పులిబిడ్డే!" అసలు కిటుకు అర్థం చేసుకొన్న రచ్చబండగుండె గొంతులో పలికింది.

"అన్నాయం!... అన్నాయం!!" అంటూ అరుస్తున్నాడు పుల్లూరుపెద్దబ్బ.

"అవునవును! నాయాలు నన్నట్లానే యాఁవారించె!" గొంతులో తడిపడకపోయినా శ్రీపురం చిన్నబ్బ తాగినవాణ్ణి మరిపిస్తున్నాడు.

మధ్యలో శీపాటిబసిరెడ్డి కల్పించుకొన్నాడు.

"యాఁవారించినా యాఁవారించకపోయ్‌నా పుల్లూరోడి తావన పత్రాలుండాయి. కోరట్టుకెక్కినా వాడిమాటే గెలిస్తింది. అట్లాగని వదిలిపెట్టేస్తే శీపరఁవోడు తూరుపు గాలికి కొట్టుకొనిపోతాడు. అందుకే నాకొక అలోచన తట్టా ఉండాది."

ఆ మాటతో ఊపిరి పీల్చుకొన్నట్లుగా కాసేపు ఆగి అందరిని కలయచూశాడు శీపాటిబసిరెడ్డి. అందరి చూపులు రచ్చబండ మీదికి మళ్ళీ బసిరెడ్డిని గుచ్చుతున్నాయి. నాకు కూడా ఆతురతగానే ఉంది- ఆ ధర్మగోవు తీర్పు వినాలని!

"తాగినోడి దగ్గిర ఇంత చవగ్గా రొండెకరాలు రాయించుకుణ్ణింది పుల్లూరోడితప్పు. ఊళ్ళో పెద్దా సిన్న ఇంతమంది ఉండంగా ఎవురితో గూడా మాట మాత్రం అనకుండా తాగేసి రాసిచ్చింది శీపరఁవోడి తప్పు."

"ఔనౌను!" అంటూ ఆమోదాన్ని గొంతెత్తి ప్రకటించింది రచ్చబండ.

"అందుకే పుల్లూరోడు చేసిన తప్పుకు తాను రాయించుకుణ్ణె మడిలో ఒక ఎకరావాడికి తిరిగి రాసిచ్చేయాల. శీపరఁ వోడు చేసిన తప్పుకు అరఎకరాచేను పుల్లూరోడికి రాసియ్యాలి. రిజిస్టర్ కర్చులు ఎవురివి వాళ్ళే బరించుకోవాల!"

అది శీపాటి బసిరెడ్డి తీర్పు. ఆ తీర్పుకు మార్పులేదు!

ఆ తీర్పు చాలా సమంజసంగా తోచింది. శీపాటి బసిరెడ్డి అనుభవ నైపుణ్యానికి మనసు చేతులు తొడుక్కొని నమస్కరించింది. ఇద్దరికీ తగినవిధంగానే ప్రాయశ్చిత్తం జరిగింది. అయితే అమాయకుడైన శ్రీపురం చిన్నబ్బకు అన్యాయం జరగకూడదనే నా నిర్ణయం. ఆమాటే నా మిత్రుడితో అన్నాను.

"శీపరంవోడికుండేది రొండెకరాలపల్లంవే. అయితే మెట్టమాత్రం అయిదెకరాల దాకా ఉండాది. అది ఆలోచించే గదా బసిరెడ్డి బావ తీర్పు చెప్పింది. నా మట్టుకు నాకు ఇది దర్మసమ్మతంగానే ఉండాది." అంటూ ఎదురుతిరిగాడు నా మిత్రుడు.

"ఇది ధర్మ సమ్మంతం కాదని నేను అనడంలేదు. అనుభవశాలి బసిరెడ్డి తిరుగులేని తీర్పే ఇచ్చాడు. అయితే పుల్లూరు పెద్దబ్బ కరణంతో చేయి కలిపి న్యాయం కండ్లుకప్పాడు. ఇది అందరికీ తెలుసు. పత్రాలు రిజిస్టరయ్యాయి కాబట్టే ఎవ్వరూ నోరు తెరవలేకపోతున్నారు. అందుకే నేననేది- ముల్లును ముల్లుతోనే తీయాలని! నీ సహకారంతో చిన్నబ్బకు న్యాయం జరుగుతుంది. ఒక అమాయకుడిని ఆదుకోవడానికి నేను ఇక్కడవారంరోజులైనా ఉంటాను."

"అదెట్లా?" అన్నట్లుగా ఆశ్చర్యంగా నావైపు చూశాడు.

వాడిసందేహానికి సమాధానంగా ఒక చిరునవ్వు నాపెదాలను తాకినట్లు తాకి చీకటిలో కలిసిపోయింది. ఏమిచేయాలో? ఎలా చేయాలో?- ఆ చీకట్లో అడుగు అటూయిటు కదల్చకుండా మాట్లాడుకొని ఒక నిర్ణయానికి వచ్చాం. అయితే ఆ నిర్ణయాన్ని మా వరకే పరిమితం చేసుకొన్నాం!

* * * *

ఆగని నడకలో అలుపే ఎరుగని గడియారం ముళ్ళ చేతుల కౌగిలింతలో వారం దినాలు కరిగిపోవడం ఎంతసేపు? ఈవారంలోపుగా పుల్లూరు పెద్దబ్బ శ్రీపురం చిన్నబ్బ బసిరెడ్డి తీర్పు మేరకు పాకాలకు వెళ్ళారు. సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో పుల్లూరు పెద్దబ్బ ఎకరా పల్లపుభూమిని శ్రీపురం చిన్నబ్బకు రిజిస్టర్‌చేయించాడు. శ్రీపురం చిన్నబ్బ అర ఎకరా మెట్టనేలను తనతప్పుకు పరిహారంగా పుల్లూరు పెద్దబ్బకు రాసిచ్చాడు. నేను మాత్రం ఇదేమీ పట్టించుకోనట్లుగా వేళకంతతిని తిరుగుతున్నాను. నా మిత్రుడు మాత్రం ఈతతంగమంతా తననెత్తిన మోస్తున్నట్లుగా తిరిగాడు.

ఆరోజు ఉదయం నుండి బాగా ఉమ్మగిస్తూ ఉంది. "ఈపూట నాలుగు చినుకులు రాలేటట్టుందే?" అని ఎవరినోట విందామన్నా ఇదేమాట. చూస్తూ చూస్తూ ఉండగానే ఆకాశం మేఘావృతమయింది. గుండెలు అదిరేటట్లు ఫెళఫెళార్భాటాలు. కండ్లు మిరుమిట్లు కొల్పుతూ మెరుపులు. "చిలకల కొండమీద మెరిస్తే చినుకురాలాల్సిందే!' అన్న పల్లె నమ్మకాన్ని కాదనలేనట్లుగా కుండపోతగా వర్షం!

ఆ మరుసటిరోజు భల్లుమని తెల్లారే సరికి మెట్టచేనుల్లో మడకలు తిరుగుతున్నాయి. శ్రీ పురం చిన్నబ్బ పుల్లూరు పెద్దబ్బకు రాసిచ్చిన అర ఎకరాలో 'నేను మడక కట్టాలంటే నేను!' అని పుల్లూరు పెద్దబ్బ నామిత్రుడు వాదానికి దిగారు. మాటకు మాట పెరిగి సిగపట్ల వరకు ఎదిగారు. ఆ పల్లె మట్టసానికి ఇలాంటి పరిస్థితి ఎదురైతే కాకితో కబురందుకొన్నట్లుగా శీపాటి

బసిరెడ్డి రెక్కలు కట్టుకొని వచ్చి వాలతాడు. వద్దన్నా ఆయన వెంట ఎప్పుడూ పదిమంది ఉంటారు.

శీపాటి బసిరెడ్డి కంటపడడంతో–

“సూడన్నా ఈ అన్నాయం. శీపరంవోడు నాకు రాసిచ్చిన చేను ఈడు నాదంటా ఉండాడు. నువ్వేగదన్నా మద్దిస్తంచేసింది. నీమాటకు నేనేవన్నా ఎగటాయించినానా? ఇదేందన్నా ఈ దౌర్జన్నెం?” అంటూ రొప్పుతూ రోజుతూ మొరపెట్టుకొన్నాడు.

శీపాటిబసిరెడ్డి “సరిపోతిందా ఈ నాయం?” అన్నట్లుగా సందేహం చూపుల్ని నా మిత్రుడిమీద సంధించాడు.

“అదిగాదుబావా! ముందురాసిన పత్రాలు చెల్లతాయా? వెనకరాసిన పత్రాలు చెల్లతాయా? నువ్వేచెప్పు. శీపరంవోడు ఈడికి శనివారం నాడు రిజిస్టర్ చేసిస్తే నాకు సోమారంనాడే రిజిస్టర్ చేసిచ్చె. అందుకే నాచేన్లో నేను మడక కట్టాలంటా ఉండా!”

ప్రతిభావంతుడైన రచయిత చేతిలో కథ ఊహించని మలుపు తిరిగినట్లు శ్రీపురం చిన్నబ్బ కథ అనుకోని మలుపు తిరిగే సరికి అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు శీపాటి బసిరెడ్డి!

“బసిరెడ్డిగారూ! పుల్లూరు పెద్దబ్బ కర్ణం కలిసి శ్రీపురం చిన్నబ్బను తాగించి మోసంచేశారన్న సంగతి అందిరికీ తెలుసు. అయితే పత్రాలు రిజిస్టర్ అయినందున ఎవరేమీ చేయలేని పరిస్థితిలో మీరిచ్చిన తీర్పు తిరుగులేనిది. అయితే కేవలం తాగుడికి అలవాటు పడిన కారణంగా చిన్నబ్బ ఇంతపెద్దనష్టాన్ని భరించడం నాకు ఇష్టంలేకపోయింది. అందుకే మీరు తీర్పు ఇచ్చిన మరునాడే చిత్తూరికి వెళ్ళి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో ఈ అర ఎకరా మనవాడి పేర రిజిస్టర్ చేయించాను. ఇప్పుడే కోర్టుకువెళ్ళినా పుల్లూరు పెద్దబ్బ పప్పులేమీ ఉడకవు. మళ్ళీ ఒకసారి పాకాలకు వెళ్ళితే చిన్నబ్బ చేను చిన్నబ్బదవుతుంది.”

వాళ్ళ సందేహాన్ని నివృత్తి చేశాను.

“సెబాస్! శానా మంచిపనిచేసినావ్ నాయినా!” అంటూ శీపాటి బసిరెడ్డి నాభుజం తట్టాడు.

“ఏం చేద్దామండీ! ఈరోజుల్లో ముల్లును ముల్లుతోనే తీయాలి!” అన్నాను నవ్వుతూ.

“ముల్లును ముల్లుతో గాదు నాయినా! వాడేల్తో వాడి కన్నే పొడ్సినావు.” అంటూ పక పక నవ్వుతున్నాడు బసిరెడ్డి.

శ్రీపురం చిన్నబ్బ కుప్పిగంతులు వేస్తున్నాడు తాగినవాడిలా!

మడక విప్పి భుజాన పెట్టుకొని ఆ కోపాన్ని మింగలేక కక్కలేక ఊగిపోతూ నోరులేని గొడ్లమీద తనప్రతాపాన్ని చూపిస్తూ న్యాయంకండ్లకు తెలివిగా గంతలుకట్టిన పుల్లూరు పెద్దబ్బ ముందుకు కదిలాడు న్యాయంకండ్లకు కట్టినగంతలు చిత్రంగా ఊడిపోయిదారి చూపిస్తుంటే! ●

ఆంధ్రభూమి మాసపత్రిక
(1, సెప్టెంబరు 1980)